సాక్షి జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 19 । నవంబర్ । 2023

ఆమె..అంతంతే
- సాధారణ ఎన్నికల్లో స్వల్పంగానే మహిళల పోటీ
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 27 మందే బరిలో..

కోడ్ ఉల్లంఘన.. కేసు నమోదు

- 10లో▸



క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువు, సంస్కారం, క్రమశిక్షణతో పాటు క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో రాణించాలని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
29^0 /22^0

వాతావరణం

జిల్లావ్యాప్తంగా ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్న సమయంలో వాతావరణం ఆహ్లాదరకంగా ఉంటుంది. రాత్రి సమయంలో పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు ఎమ్మెల్సీ కవిత రాక



కాటారం: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు(ఆదివారం) కాటారం రానున్నారు. బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు తరఫున నిర్వహించే ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో కవిత మాట్లాడనున్నారు. కవిత రాకను పురస్కరించుకొని ఘన స్వాగతం పలుకడానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కాటారం సీఐ రంజిత్‌రావు, ఎస్సై అభినవ్ సభాస్థలాన్ని శనివారం పరిశీలించారు.

కాళేశ్వరాలయంలో కార్తీక శోభ



కాళేశ్వరం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీకశోభ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం స్వామి వారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు, ఉసిరి చెట్టు వద్ద లక్ష వత్తులు వెలిగించి, లక్ష ముగ్గులు వేశారు. దీంతో ఆలయంతో పాటు గోదావరి తీరంలో భక్తుల సందడి కనిపించింది.

సమాజానికి సేవచేయాలి

మహదేవపూర్: విద్యార్థులు శిక్షణను ఉపయోగించుకుని సమాజానికి సేవ చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దేవరాజం అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ట్రెయినింగ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. వార్షిక పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ప్రాక్టికల్స్, సిలబస్ త్వరగా పూర్తిచేసి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీటీడీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి అర్బన్: కార్తీక మాసం పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని చతుర్రూప అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం మన గుడి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. టీటీడీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కార్తీకమాస మహోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8గంటల వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, 27న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అర్చకులు వీరస్వామి, నరేందర్‌రెడ్డి, సడవలయ్య, సందీప్, ధర్మప్రచార మండలి సభ్యులు రఘువేందర్, రాజు, శ్రీనివాసచార్యులు, నరహరిశర్మ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రం ఆవిష్కరణ



కాటారం: చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ కాటారం మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. జనభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాలని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి దేవేందర్, కాటారం, మహదేవపూర్, పలిమెల మండలాల అధ్యక్షులు కుమార్, రాజన్న, పొట్టన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

కమలంలో ఖుషి..





ఖిలా వరంగల్ మైదానంలో జరిగిన సభకు హాజరైన జనం

ఓరుగల్లు విజయ సంకల్ప సభ సక్సెస్
- బీఆర్ఎస్ టార్గెట్‌గా సాగిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగం
- కేసీఆర్ అవినీతి పెరిగిపోయిందని, కక్కిస్తామని వ్యాఖ్యలు..
- కేంద్రం కేటాయించిన నిధులు, సంక్షేమ పథకాలపై వివరణ
- వరంగల్ ఎంజీఎంకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని హామీ
- డబుల్ ఇంజన్ సర్కారు వస్తేనే మరింత అభివృద్ధి
- వరంగల్ పుణ్య భూమిపై అడుగు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడి

ఖిలా వరంగల్ : ఎన్నికల ప్రచారం మొదలయ్యాక తొలిసారి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వరంగల్‌కు రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఖిలా వరంగల్ మైదానంలో శనివారం జరిగిన బీజేపీ ఓరుగల్లు సకల జనుల విజయ సంకల్ప సభకు జనం నుంచి భారీగా స్పందన రావడంతో ఆ పార్టీ నాయకులు ఖుషీలో ఉన్నారు. అమిత్‌షా ప్రసంగం మొత్తం బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తూ.. కేంద్ర సంక్షేమంపై సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. సభ ప్రారంభానికి ముందే భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. సాయంత్రం హెలికాప్టర్‌లో మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అమిత్ షా నేరుగా కాన్వాయ్‌లో సభా మైదానానికి చేరుకున్నారు. వేదికపైకి చేరుకుని హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని నియోజకవర్గాల అభ్యర్థులను పరిచయం చేసి ప్రసంగం మొదలుపెట్టారు. డబుల్ ఇంజన్ సర్కారు వస్తే తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి జరుగుతుందని, అవకాశం ఇస్తే బీసీని సీఎం చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీని గెలిపిస్తే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని చెప్పగా, సభకు వచ్చిన జనం చప్పట్లు, కేరింతలతో ప్రాంగణమంతా మార్మోగింది. ఓరుగల్లుకు గొప్ప చరిత్ర ఉందని, కాకతీయుల కళారాజ్యంలో భద్రకాళి, రామప్ప లాంటి ఎన్నో పవిత్రమైన పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, అటువంటి పుణ్య భూమిపై అడుగు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ ప్రజల ప్రగతి కోసం ఎంతో చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రావు పద్మ, డాక్టర్ కాళీప్రసాద్ రావు, కొండేటి శ్రీధర్, కంభంపాటి పుల్లారావు, కీర్తిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



వరంగల్ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావును గెలిపించాలని కోరుతున్న అమిత్‌షా

కేసీఆర్ పాలనపై విమర్శల వెల్లువ

పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ నాశనం చేశారని అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. సర్వ సంపన్న తెలంగాణను సీఎం కేసీఆర్ పాలనలో అవినీతి, కుంభకోణాలతో అప్పులకుప్పగా మార్చారని దుమ్మెత్తి పోశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయలో అవినీతి, అతిపెద్ద కుంభకోణం జరిగిందని, ఇలా లెక్కబెట్టాలంటే వారం రోజులు పడుతుందని ఆరోపించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఎలుకలు కొరికి రోగి చనిపోయినా పట్టింపులేదని విమర్శించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రూ.వేల కోట్లు కేటాయించి అభివృద్ధిలో వరంగల్‌ను ముందుంచుతామని హామీ ఇచ్చారు. ఎడ్ల అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు డాక్టర్ రాజేశ్వర్‌రావు, మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్, కుసుమ సతీష్, గంట రవికుమార్, అల్లం నాగరాజు, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటన ఇలా..

సాయంత్రం 4.20 గంటలకు	హెలికాప్టర్‌లో మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు రాక
4.32 గంటలకు:	ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ సభ వద్దకు ..
4.36 గంటలకు :	ప్రసంగం ప్రారంభం.
4.54 గంటలకు:	ప్రసంగం ముగింపు
4.55 గంటలకు:	ఎయిర్‌పోర్ట్‌కు వాహనంలో బయల్దేరిన అమిత్ షా
5.10 గంటలకు :	ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్‌కు పయనం

తూర్పును గూండాల నుంచి కాపాడాలి : బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు



వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని గూండాల రాజ్యం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తూర్పు అభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఆజంజాహి మిల్లును అమ్మి, సెంట్రల్ జైలును కుదువపెట్టినందున వరంగల్ ప్రజలు, యువతకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని డ్రెయినేజీలు, నాలాలు ఆక్రమణకు గురికావడంతో చిన్నపాటి వర్షానికే వీధులన్నీ జలమయమవుతున్నాయన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ అభివృద్ధి చేయడమే కాకుండా కేంద్రం నుంచి భారీ పరిశ్రమలను తీసుకువస్తామని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా



మాట్లాడుతున్న అభయ్‌నందన్ అంభస్తా

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: ఓటర్ల సౌకర్యార్థం భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, దివ్యాంగుల కోసం వీల్ చైర్ ర్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ రోజు పోలింగ్ అధికారులు, సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. గ్రామాల వారీగా అధిక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశాలను గుర్తించి ఆ కేంద్రాల వద్ద ఒక సీనియర్ అధికారిని నియమించాలని చెప్పారు. ఓటర్లకు సలహాలు ఇవ్వాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా రిటర్నింగ్ అధికారి కె.రమాదేవి, పోలింగ్ స్టాఫ్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయ్‌భాస్కర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, అధికారులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

పోలింగ్ రోజున స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు అభయ్‌నందన్ అంభస్తా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు అభయ్ నందన్ అంభస్తా జిల్లా ఎన్నికల అధికారి, భూపాలపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జరగబోయే అసెంబ్లీ సాధారణ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు, మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళిని, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు వారి విధులను పటిష్టంగా నిర్వహిస్తూనే పోలింగ్ టీంలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన మేరకు మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ టీంకు ఎన్నికల నిర్వహణపై తగు సూచనలు చేయవచ్చని తెలిపారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు జరిగిన ఘటనలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఓటరు ఓటు ఎవరికి వేశారనే రహస్యాన్ని బయటపెట్టకుండా చూడాలన్నారు. వారికి కేటాయించిన క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో వసతులు ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. మైక్రోఅబ్జర్వర్లు పోలింగ్ కేంద్రానికి కళ్లు, చెవుల వంటి వారని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్‌లు, ఉదయం ఆరు గంటలకు మాక్ పోలింగ్, పీఓ డైరీ చెక్ చేయాల్సి ఉంటుందన్నారు. వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, గ్రీన్ పేపర్ సీల్స్ మొదలైన వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికలలో గతంలో జరిగిన హింసాత్మక సంఘటనలు, బెదిరింపులకు పాల్పడడం, నిర్దిష్ట అభ్యర్థికి అనుకూలంగా అసాధారణంగా అధిక ఓటింగ్ జరగడం మొదలైన వాటి ఆధారంగా క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ఓ రమాదేవి, ఎల్‌డీఎం తిరుపతి, సీపీఓ శామ్యూల్, డీఎఫ్ఓ అవినాష్, మైక్రోఅబ్జర్వర్లు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న జడ్జి మాధవి

ములుగు: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ములుగు జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవి శనివారం జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, జిల్లా పరిషత్ సాధికార, బండారుపల్లి, జంగాలపల్లి ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 14 సంవత్సరాల లోపు బాల బాలికలను పనులకు పంపడం నేరమని అన్నారు. చిన్నారులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా తల్లితండ్రులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్‌లకు అలవాటు కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ లీగల్ చీఫ్ ఎయిడ్ కౌనిల్స్ బానోత్ స్వామిదాస్, తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

మల్హర్: ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండంపేట గ్రామంలో పోలింగ్ బూత్‌లను డీఎస్పీ శనివారం పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు సమావేశం నిర్వహించి ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలంతా సహకరించాలన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కావవద్దని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ రంజింత్‌రావు, కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ బస్తాలు ఆగేనా..?



కొండాయి వద్ద నిర్మిస్తున్న తాత్కాలిక రోడ్డు

- కొండాయి కాజ్‌వేలో అయోమయం
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

ఏటూరునాగారం: ఎన్నికలు, మేడారం జాతర సమీపిస్తోందన్న కారణంతో హడావుడిగా నిర్మిస్తున్న కొండాయి–దొడ్ల గ్రామాల మధ్యలోని జంపన్నవాగు కాజ్‌వే(పైపుల కల్వర్టు) ఎంతకాలం నిలుస్తుందనేదానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాత్కాలిక రోడ్డు నిర్మాణం కోసం ఆర్ అండ్ బీ శాఖ నుంచి రూ.20లక్షలు మంజూరు కాగా పనులను గుత్తేదారుతో చేయిస్తున్నారు. అయితే నీటిలో పైపులు దిగిపోకుండా వేస్తున్న ఇసుక బస్తాల నుంచి నీటి ఉధృతికి ఇసుక మొత్తం కొట్టుకుపోయి బస్తాలే మిగిలిపోతున్నాయి. పైపులు వేసిన తర్వాత కూడా ఇసుక మొత్తం కొట్టుకుపోతే పైపులు దిగబడి రోడ్డు కుంగిపోయే ప్రమాదం ఉంది. పైపులపై కేవలం ఇసుక పోయడం వల్ల కూడా ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. ఇసుక బస్తాల్లో వాగులోని ఇసుకను నింపుతున్న క్రమంలో బస్తాలకు సరైన సీల్, తాళ్లతో కట్టడం వంటివి చేయకపోవడం గమనార్హం. దీనివల్ల ఇసుక రోజు రోజుకూ కొద్దిగా పోవడంతో మళ్లీ ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. పనులను పర్యవేక్షించాల్సిన ఆర్ అండ్‌బీ అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొండాయి వాగులో నిర్మించే పైపు కల్వర్టును నాణ్యతగా నిర్మించి తమ ఇబ్బందులను తొలగించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

సాగు భారం

- పెరుగుతున్న పెట్టుబడులు
- వరి కోత యంత్రాలకు పెరిగిన అద్దెలు
- తగ్గిన దిగుబడి, ఆందోళనలో అన్నదాతలు



ఆముదాలపల్లిలో వరి కోత కోస్తున్న హార్వేస్టర్

భూపాలపల్లి రూరల్: రైతులకు సాగు భారంగా మారుతోంది. డీజిల్, ఎరువుల, విత్తనాల ధరలు, కూలీల రేట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో సాగుఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. పంట పెట్టుబడులు పెడుతూ.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పథకాల కింద పెట్టుబడి సాయం అందుతున్నా.. పెరిగిన పెట్టుబడులతో ఇవి సరిపోవడం లేదు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో వర్షాలు కురవక పోవడంతో వరి దిగుబడి కూడా తగ్గినట్లు రైతులు దిగులు చెందుతున్నారు.

1,10,799 ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు, గణపురం, భీంఘన్‌పూర్ సరస్సులతో పాటు 600లకు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇంకా బోర్లు, బావుల కింద సేద్యం చేస్తున్నారు. ఇలా నీటి వనరులుండటం, వర్షాలు సకాలంలో కురుస్తాయన్న ఆశతో ఏటా రైతులు వరి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 1,10,799 ఎకరాల్లో వరి సాగు చేశారు. వర్షాలు లేక వాతావరణం అనుకూలించక తగ్గిన దిగుబడితో పెట్టుబడి రాని వైనం చోటుచేసుకొంది. అటవీ గ్రామాల్లో అడవి పందులతో పంట పొలాలను ధ్వంసం చేయడంతో ధాన్యం నేలరాలి దిగుబడి తగ్గిన పరిస్థితులు నెలకొన్నాయి.

ట్రాక్టర్ ద్వారా ఎకరానికి పొలం దున్నేందుకు అయ్యే ఖర్చు

ఏడాది	ధర రూ.లల్లో	ఏడాది	ధర రూ.లల్లో
2020	3,500	2022	5,000
2021	4,000	2023	6,000

పెరిగిన పెట్టుబడులు..

సీజన్ ప్రారంభంలో పొలాన్ని దున్నే దగ్గరి నుంచి పంట చేతికి వచ్చి మార్కెట్‌లో విక్రయించేదాక అన్నదాతలు యాంత్రీకరణపై ఆధార పడుతున్నారు. గతేడాది పొలం దున్నడానికి ఎకరాకు రూ.4వేలు తీసుకుంటే ఈ ఏడాది మాత్రం ఎకరాకు రూ.6వేలు తీసుకున్నారు. పెరిగిన డీజిల్ ధరలు కారణమంటున్నారు. వీటితో పాటు నాటువేసే కూలీలు ఎకరాకు రూ.5,500, వాహన ఖర్చులు అదనంగా తీసుకున్నారు. మగ కూలీలకు గతంలో రూ.500 ఉంటే ఈ ఏడాది రూ.600 నుంచి రూ.700 వరకు పెరిగింది. వరికోత మిషన్ హార్వేస్టర్ గతేడాది అద్దె గంటకు రూ.1,700 ఉంటే ఈ ఏడాది ఏకంగా రూ.2,000లకు పెంచారు. వీటితో పాటు విత్తనాలు ఎరువులకు పెరిగిన ధరలతో పోల్చుకుంటే నష్టాలే వస్తున్నాయని అన్నదాతలు వాపోతున్నారు.



పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు కమలాపూర్ గ్రామానికి చెందిన రేగళ్ల స్వామి. రెండెకరాల్లో 1010 రకం వరి సాగు చేశాడు. రెండు నెలలుగా వర్షాలు కురవక పంట దిగుబడి తగ్గింది. గతేడాది ఎకరాకు 26 నుంచి 28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఎకరాకు 16 నుంచి 18 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉందంటున్నాడు. కూలీల ఖర్చులు, ట్రాక్టర్, వరికోత యంత్రం ఖర్చులతో పోల్చుకుంటే పెట్టుబడి కూడా రాదని వాపోతున్నాడు. జిల్లాలో చాలామంది రైతుల పరిస్థితి ఈ విధంగానే ఉంది.

ఖర్చులు పెరిగాయి..



ఏటా వరి సాగుకు ఎకరాకు ఖర్చు రూ.20వేల లోపు అయ్యేది. ఈ ఏడాది రూ.25వేలకు పైగా దాటింది. మూడెకరాల్లో వరి సాగు చేశాను. ఈ ఏడాది మొదట కురిసిన వర్షాలకు పొలం ఎర్రబడింది. రసాయనిక మందులు, ఎరువులు వాడాను. పంట కోతకు వచ్చిన సమయంలో అడవి పందులు పొలంలోకి రావడంతో పొలం మొత్తం నేలవాలింది. దీంతో దిగుబడి తగ్గింది. పెట్టుబడి వచ్చేటట్లు లేదు.

-జాడి మల్లయ్య, ఆముదాలపల్లి భూపాలపల్లి

'ఆదివాసీ చట్టాల జోలికి రావొద్దు'

వాజేడు: ఆదివాసీ చట్టాల జోలికి రావొద్దని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర అన్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రేగ గణేష్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గిరిజనేతరుడు రమణా రెడ్డి ఆదివాసీ చట్టాలపై మాట్లాడటం సరికాదన్నారు. 5వ షెడ్యూల్, 1/70 చట్టాలు ఆదివాసీలకు అతి ముఖ్యమైనవని తెలిపారు. వాటిపై రమణారెడ్డికి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. సమావేశంలో పాయం కృష్ణ, పూనెం శ్రీను, నాగరాజు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



రామప్పలో విద్యార్థుల సందడి

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. నంది విగ్రహం వద్ద గ్రూపు ఫొటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు.



అంతులేని అభిమానం..

ఖిలావరంగల్ వాకర్స్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు వరంగల్ పెరుకవాడకు చెందిన ఓ బీజేపీ నేత వినూత్నంగా హాజరయ్యాడు. బైక్‌కు పదుల సంఖ్యలో పార్టీ జెండాలు ఏర్పాటు చేసి అందరిని ఆకర్షించాడు. – ఖిలా వరంగల్





చకోడి చేస్తా..'చేయి' కలుపు..

కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భార్య అరుణ శనివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లి బజ్జీ, చకోడిలు చేస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. – బచ్చన్నపేట



మల్లా.. 'చల్లా'నే గెలిపించాలి..

బీఆర్‌ఎస్ పరకాల అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సతీమణి జ్యోతి శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల షాపు వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి మళ్లీ చల్లానే గెలిపించాలని అభ్యర్థించారు. – ఆత్మకూరు




దర్జీ..నాయక్

మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్ షాపులో దుస్తులు కుట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. – మహబూబాబాద్

జంగ్ తెలంగాణ

ఆమె.. అంతంతే

విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా వివిధ రంగాల్లో మహిళలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నారు. తమకు లభించిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ పురుషులకు దీటుగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అయితే అవగాహన లేకనో.. అవకాశం రాకనో కాని రాజకీయ కదన రంగంలో మాత్రం అంతంత పాత్రే పోషిస్తున్నారు. దీనికి నిదర్శనమే ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 188 మంది పురుష అభ్యర్థులు పోటీపడుతుండగా 27 మంది మహిళలు మాత్రమే బరిలో నిలిచారు. దీంతో రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



సాధారణ ఎన్నికల్లో స్వల్పంగానే మహిళల పోటీ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో బరిలో 27 మందే ..
- పురుషులు 188 మంది..
- మొత్తం 215 మంది పోటీకి సై



రావు పద్మ(బీజేపీ)



సురేఖ(కాంగ్రెస్)



సీతక్క(కాంగ్రెస్)



నాగజ్యోతి(బీఆర్‌ఎస్)



కీర్తిరెడ్డి(బీజేపీ)



యశస్విని(కాంగ్రెస్)



సంగీత(బీజేపీ)



ఇందిర(కాంగ్రెస్)

హన్మకొండ: రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మహిళలు బరిలోకి దిగారు. 12 నియోజక వర్గాల్లో ఒక్కటి మినహా 11 స్థానాల్లో బ్యాలెట్ పోరులో నిలిచారు. ప్రధాన పార్టీ అభ్యర్థులుగా, రిజిస్టర్ పార్టీ అభ్యర్థులుగా, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 29,74,564 ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 15,05,252 మంది ఉండగా, పురుష ఓటర్లు 14,68,845 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 467 మంది ఉన్నారు. 36,407 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అదే విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 215 మంది ఎన్నికల బరిలో నిలించారు. ఇందులో 188 మంది పురుషులుండగా 27 మంది మాత్రమే మహిళలు పోటీ చేస్తున్నారు. జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు ఎన్నికలో ఆ మేరకు ప్రాధాన్యం, ప్రాతినిధ్యం లభించడం లేదు. పోటీ చేసిన అభ్యర్థుల్లో 12.6 శాతం మంది మాత్రమే మహిళలున్నారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీజేపీ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి నలుగురు, బీఆర్‌ఎస్ నుంచి ఒక్కరు పార్టీ అభ్యర్థిత్వం దక్కించుకున్నారు. మిగతా మహిళా అభ్యర్థులు గుర్తింపు పొందిన పార్టీ, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. కాగా పరకాల నుంచి ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరు. 11 నియోజకవర్గాల్లో మాత్రమే మహిళా అభ్యర్థులు నామినేషన్లు వేసి చివరికంటూ పోటీలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా వరంగల్ తూర్పు నుంచి బీఎస్పీ అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ చిత్రపు పుష్పలత లయ పోటీ చేస్తున్నారు.

- **వరంగల్ పశ్చిమ** నియోజకవర్గంలో బరిలో మొత్తం 15 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు మహిళలు ఉన్నారు. బీజేపీ నుంచి రావు పద్మ, ధర్మసమాజ్ పార్టీ నుంచి కోగిల రూప ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.
- **వరంగల్ తూర్పు** నియోజకవర్గం నుంచి ఎన్నికల రణరంగంలో 29 మంది పోటీ పడుతున్నారు. ఇక్కడ ఆరుగురు మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి కొండా సురేఖ, స్వతంత్రులుగా జన్ను ప్రమీల, పల్లకొండ మహేశ్వరి, పోలేపాక చంద్రకళ, భవంతుల రాధిక, జోగు శ్వేత ఉండగా ఇక్కడి నుంచి ట్రాన్స్ జెండర్ చిత్రపు పుష్పలత లయ (బీఎస్పీ) ఎన్నికల్లో తమ సత్తా చాటాలని చూస్తున్నారు.
- **పరకాల** నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఇక్కడ ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరు.
- **వర్ధన్నపేట** నియోజకవర్గంలో ఎన్నికల బరిలో 14 మంది నిలిచారు. ఇక్కడ ఇద్దరు మహిళలు పోటీలో నిలిచారు. ఎంసీపీఐ నుంచి కొత్తపల్లి సావిత్రి, సరిగొమ్ముల స్నేహలత స్వతంత్ర అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.
- **నర్సంపేట** నియోజకవర్గం నుంచి 16 మంది ఎన్నికల రణరంగంలో పోటీ పడుతున్నారు. ఇక్కడ 15 మంది పురుషులు పోటీ చేస్తుండగా, మహిళా అభ్యర్థి ఆరెల్లి లత (జన శంఖారావం) ఒక్కరే పోటీలో ఉన్నారు.
- **భూపాలపల్లి** నియోజకవర్గంలో మొత్తం 23 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ ఐదుగురు మహిళలు బరిలో ఉన్నారు. చందుపట్ల కీర్తిరెడ్డి (బీజేపీ), రత్నం పోశమ్మ (సోషల్ జస్టిస్ పార్టీ), అల్లకొండ స్రవంతి (అబాద్ పార్టీ), మహమ్మద్ ఆశ్రఫ్ (ఎంసీపీఐ-యూ) గోపిదాస్ రజని(స్వతంత్ర) పోటీలో ఉన్నారు.
- **ములుగు** నియోజకవర్గం నుంచి మొత్తం 11 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ ముగ్గురు మహిళలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బడే నాగజ్యోతి (బీఆర్‌ఎస్), ధనసరి అనసూర్య (సీతక్క) (కాంగ్రెస్), వజ్జ సమ్మక్క (స్వతంత్ర) పోటీలో ఉన్నారు.
- **మహబూబాబాద్** నియోజకవర్గం నుంచి మొత్తం 12 మంది ఎన్నికల బరిలో ఉండగా భట్టు భిన్నమ్మ (స్వతంత్ర) ఒక్కరే పోటీలో ఉన్నారు.
- **డోర్నకల్** నియోజకవర్గంలో ఎన్నికల బరిలో మొత్తం 14 మంది ఉన్నారు. ఇందులో ఇద్దరు మహిళలు పోటీ చేస్తున్నారు. భూక్యా సంగీత (బీజేపీ), గుగులోత్ పార్వతి (బీఎస్పీ) పోటీలో ఉన్నారు.
- **పాలకుర్తి** నియోజకవర్గం నుంచి మొత్తం 15 మంది ఎన్నికల బరిలో నిలిచారు. మామిడాల యశస్విని (కాంగ్రెస్) ఒక్కరే మహిళా అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.
- **జనగామ** నియోజక వర్గంలో మొత్తం 19 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇందులో ఒక్కరు మాత్రమే మహిళా అభ్యర్థి ఉన్నారు. జంగా సుజాత స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు.
- **స్టేషన్ ఘన్‌పూర్** నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ ముగ్గురు మహిళలు పోటీ చేస్తున్నారు. సింగాపురం ఇందిర (కాంగ్రెస్), చిలుక వర్ష, కుర్సపల్లి నవ్య స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.

కోడ్ ఉల్లంఘన.. కేసు నమోదు

నర్సింహులపేట: బీజేపీ డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా సంగీత ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో ఎన్నికల అధికారులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్వామి వివేకానంద విగ్రహ ప్రహరీ, కరెంట్ స్తంభాలకు అభ్యర్థి ప్రచార పోస్టర్ అంటించారు. ప్రచారాలకు ప్రభుత్వ ఆస్తులను వాడుకోవడంతో పలువురు యువకులు శనివారం గమనించి సీ-వీఐజీఐఎల్ ఐడీ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎన్నికల అధికారి కేశవరావు, ఎఫ్‌ఎస్‌టీ టీం అధికారి రాజలింగం ఘటనా స్థలిని పరిశీలించారు. రుజువు కావడంతో బీజేపీ అభ్యర్థి సంగీతపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు.

యువకుడి మృతి

ములుగు రూరల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని పత్తిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పోరిక సురేష్ (25) తన తల్లి ఇంట్లో దుస్తులు ఉతికి తీగపై ఆరేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. తల్లిని రక్షించే క్రమంలో సురేష్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇద్దరు స్పృహ కోల్పోయారు. కొంత సమయం తర్వాత తల్లి తేరుకుంది. సురేష్ తేరుకోకపోవడంతో గమనించిన కుటుంబీకులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. సురేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని..

- యువకుడి ఆత్మహత్య



రాజ్‌కుమార్ (ఫైల్)

కాశిబుగ్గ: ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన కట్ట సుజాత తన భర్త మృతి చెందడంతో నగరంలో ఎండోమెంట్ శాఖలో ఉద్యోగం చేస్తూ కుమారుడు రాజ్‌కుమార్(23)తో కలిసి నగరంలోని గిర్మాజీపేటలో నివాసం ఉంటోంది. రాజ్‌కుమార్ ఒకేషనల్ చదువుతున్నాడు. తరుచూ తల్లిని ఖర్చులకు డబ్బులు అడుగుతూ ఇవ్వకపోతే చనిపోతానని బెదిరిస్తూ పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. శుక్రవారం మళ్లీ తల్లిని ఖర్చులకు డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. దీంతో అదేరోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి రైలు కింద పడి చనిపోతున్నానని ఫోన్‌లో చెప్పాడు. అనంతరం నగరంలోని సంతోషిమాతా ఆలయం ఎదుట ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కె భాస్కర్ కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లి సుజాతకు అప్పగించామని సీఐ నరేష్ శనివారం తెలిపారు.


మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి..

కన్నాయిగూడెం: మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కారణంతో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బుట్టాయిగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన సునార్కని మల్లయ్య (55) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భార్య సమ్మక్కను డబ్బులు ఇవ్వమని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన మల్లయ్య అదే రోజు పొలం వద్ద పురుగుల మందు తాగాడు. అనంతరం ఇంటికి చేరుకోగా కుటుంబీకులు గమనించి 108లో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్

కాజీపేట రూరల్ : విద్యార్థులు చదువు, సంస్కారం, క్రమశిక్షణతో పాటు క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో రాణించాలని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ అడిషనల్ డీఎంఈ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్ ఆవరణలో శనివారం స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోని పొలిశెట్టి ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల మాంట్‌ఫోర్డ్ స్టేట్ మెగా గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌ను మోహన్‌దాస్, ఆంటోనితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహన్‌దాస్ మాట్లాడుతూ.. సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ విద్యతో పాటు స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌ఓ జి.అశోక్, టీఎస్‌ఏఏ కె.సారంగపాణి, ప్రెసిడెంట్ జైకో జెర్వసిస్, షాజన్ ఆంథోని, ప్రిన్సిపాల్ విన్సెంట్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ బాల ఇన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.విజయకుమార్, సూర్యారావు, ఉపాధ్యాయ బృందం, ఎన్‌సీసీ కెడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ తదితరులు

ప్రకృతి వ్యవసాయం లాభాదాయకం

హసన్‌పర్తి : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటతో పాటు అధిక దిగుబడి పొందవచ్చని ఎస్సార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ భూపాల్ అన్నారు. ఈ మేరకు కళాశాల విద్యార్థినులు గంటూరుపల్లిలో రైతులకు క్షేత్ర ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం దేశవాళీ పద్ధతులపై అవగాహన కల్పించారు. వేపాకు, వెల్లుల్లి, మిర్చి, బొప్పాయి ఆకు, కొత్తిమీర గింజలు, తులిసాకు సారం, కొబ్బరి పాలు, మజ్జిగతో తయారుచేసిన ద్రావణం వల్ల కలిగే వివిధ ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసం పీల్చే కీటకాలు, శిలీంధ్రాల నుంచి రక్షణగా పనిచేస్తోందన్నారు.ఆకు కూరల పంటల్లో పువ్వు రాలకుండా నిరోధిస్తుందన్నారు. విద్యార్థినులు క్రిస్టియానా జోన్స్, ఆయేషా సిద్ధిఖ్, హేమారెడ్డి, హారికనందు, స్వాతి, సునీత, పూజిత, శ్రీహర్షిత, ప్రవళిక, అనన్య చంద్రిక, సమియా, మార్టిన్ జోన్స్ ఉత్పత్తులను తయారు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్ది తిరుపతమ్మ, అధ్యాపకుడు డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

విశిష్ట వైద్యం.. ఆయుర్వేదం

- కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్

కాశిబుగ్గ : ప్రపంచంలోనే ఆయుర్వేదం విశిష్టమైన వైద్య విధానమని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల వరంగల్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌కుమార్ అన్నారు. ఎన్‌సీఐఎస్‌ఎం ఆదేశాల మేరకు 15రోజులుగా కళాశాలలో మొదటి ఏడాది బీఏఎంఎస్ విద్యార్థులకు నిర్వహిస్తున్న 'ట్రాన్సిషనల్ కరిక్యులమ్' కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్లు మాట్లాడారు. బీఏఎంఎస్ చదువుతో భవిష్యత్ ఉందని, ఉత్తమ వైద్యులుగా రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ బాల్నె సాంబమూర్తి, రిటైర్ ప్రొఫెసర్లు డాక్టర్ రమేశ్ బాబు, సిరాజుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ వాసంతి, జ్ఞానేశ్వర్, కల్యాణ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నియంతృత్వం.. ప్రజాస్వామ్యానికి మధ్యే పోరాటం

- ఉద్యమ ఆకాంక్షను తుంగలో తొక్కిన కేసీఆర్
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హన్మకొండ : నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న పోరాటమే ఈ ఎన్నికలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని విశాల్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నాయకులు ఓట్ల కోసం మాత్రమే వస్తారని, ఎన్నికల ముగిశాక పట్టించుకోరని విమర్శించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి ప్రజల మనిషి అని, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సీపీఐ మద్దతు ఇస్తుందని, వారి గెలుపునకు కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఓట్లను చిందరవందర చేశారని ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంల సమక్షంలో దొంగ ఓట్ల నమోదు, ఓటరు గుర్తింపు కార్డులు తయారు చేస్తున్నారని, వీటిని చూసి తాను అవాక్కయ్యానన్నారు. బీఆర్‌ఎస్ గెలిచేది లేదని తెలిసి అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలి

న్యూశాయంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీతో సీపీఐ పొత్తు పెట్టుకుందని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా సమితి సమావేశం సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు పంచాల రమేశ్, శ్రీనివాస్ అనిల్, సదాలక్ష్మి, ఎల్లేశ్, రాములు, లక్ష్మణ్, వీరస్వామి, రాజమౌళి, రాజుగౌడ్, వెంకటరమణ, ఓదేలు, రవి, సంతోష్, శంకర్, రమాదేవి, దీనా, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ విఫలం

ఖిలా వరంగల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు తమ పార్టీ సమష్టిగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈమేరకు శనివారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.